క్లుప్తంగా

ఘనంగా కొండ మహంకాళి వార్షికోత్సవం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని రజక కుల ఆరాధ్య దైవం కొండ మహంకాళి అమ్మవారి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆయనతో పాటు స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, కొల్లూరు నేతలు పైల లక్ష్మీనారాయణ, గణేష్, దాలయ్య, నూకయ్య, హరిబంధు, భాస్కరరావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కంచిలి ఏఎంసీ చైర్మన్‌గా మోహనరావు


బతకల మోహనరావు

కంచిలి: కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా సోంపేట మండలం సుంకిడి గ్రామానికి చెందిన బతకల మోహనరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బైపల్లి కూర్మమ్మ, సభ్యులుగా త్రివేణి సేనాపతి, కిలుగు అరావతి, డొక్కరి దాలయ్య, బత్తిని బాలరాజు, చెత్త రష్మిత, లుండి క్రిష్ణవేణి, ఉత్తరాల ఇందుమతి, మహమ్మద్ సాయిపుల్లా, యరుమాకు జలజాక్షి, బట్టి కామాక్షి, పిరియా విజయ్‌కుమార్, బెందాళం కృష్ణారావు, కంచిలి పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, జిల్లా అగ్రికల్చరల్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, సోంపేట వ్యవసాయ శాఖ ఏడీ, కంచిలి సర్పంచ్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కోటబొమ్మాళి: పంచాయతీల్లో చేయపట్టనున్న అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో నిశ్చల, ఈవోపీఆర్డీ తులా రాజారావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలన్నారు. పంచాయతీలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

మేడే కరపత్రం ఆవిష్కరణ

కాశీబుగ్గ: మేడే కరపత్రాన్ని ప్రగతిశీల కార్మిక సమాఖ్య మంగళవారం విడుదల చేసింది. మే ఒకటి నుంచి ఐదో తేదీ కార్ల్‌మార్క్స్ జయంతి వరకు వాడవాడలా ప్రదర్శనలు, సభలు ఎర్ర జెండాల ఆవిష్కరణలు చేయాలని పిలుపునిస్తూ కాశీబుగ్గ అచలగురు ఆశ్రమం వద్ద మే డే కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీకేఎస్ కార్యదర్శి పి.దుర్యోధన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు కొనసాగిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దేవడ నారాయణమూర్తి, పురుషోత్తం, రాజారావు, లోకనాథం, జోగారావు, ధర్మారావు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం


పూజలు చేస్తున్న శ్రీదేవి

వజ్రపుకొత్తూరు: ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని మంత్రి సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి అన్నారు. పూండి–గోవిందపురంలోని ఉమాకామేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన పాలిన శ్రావణితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు కొంచాడ ధర్మారావు, గోవిందరావు దంపతులు, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

డీటీ, ఆర్‌ఐలకు బదిలీ

కోటబొమ్మాళి: తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం జరిగింది. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధుకు కొత్తూరు, ఆర్‌ఐ శివరామకృష్ణకు పాతపట్నం తహసీల్దార్ కార్యాలయానికి బది లీ చేస్తూ టెక్కలి సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే కొత్తూరు, పాతపట్నంలో పనిచేస్తున్న డీటీ, ఆర్‌ఐలను కోటబొమ్మాళి కార్యాలయానికి కేటాయించినట్టు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ తెలిపారు.

ముగిసిన చర్చి వార్షిక సభలు

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో ఉన్న లివింగ్ స్టోన్ చర్చిలో రెండు రోజులుగా పాస్టర్లు కె.అబ్రహం, ఐజాక్‌ల అధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సభలు మంగళవారంతో ముగిశాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. డాక్టర్ ఎడ్వర్డ్ విలియం, డాక్టర్ ఎర్నెస్ట్ తాతపూడి దైవ సందేశం వినిపించారు.

28న మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్మన్ బళ్ల గిరిబాబు తెలిపారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

గిరిజన అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- సాబకోట పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


భావనాపురంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: గిరిజన అభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సాబకోట పంచాయతీ పరిధిలో గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు గిరిజనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. పదేళ్లలో సాబకోట పంచాయతీలో 15 ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని మూడున్నరేళ్లలో 305 ఇళ్లను గిరిజనులకు నిర్మించామన్నారు. అలాగే 55 నుంచి 50 ఏళ్లకు వయసు తగ్గించి పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ప్రతీ గిరిజన పల్లెకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం గిరిజన ప్రాంతాలు సుందరంగా కనిపిస్తున్నాయన్నారు. పంచాయతీ పరిధిలో కొన్ని సమస్యలున్నాయని, వీటిని పరిష్కరిస్తామన్నారు. భావనాపురానికి రోడ్డు నిర్మాణం జరుగుతోందని, తొందరగా పూర్తి చేస్తామన్నారు. బలియాసాయికి రోడ్డు నిర్మిస్తామన్నారు. పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు ఆర్‌ఓఆర్ పట్టాలు అందజేస్తామని, మిగులు భూములను గుర్తిస్తే.. గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఇదే పంచాయతీలో ఖరీఫ్ సీజన్‌కు గిరిజన రైతులు ఎక్కువగా ధాన్యాన్ని ఆర్బీకేకు ఇచ్చారన్నారు. దీంతో ప్రభుత్వ పథకాల పనితీరు స్పష్టం అవుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అప్పుడే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయని, వాటి లక్ష్యాలకు సార్థకత చేకూరుతుందన్నారు. సర్పంచ్ సవర సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గిరిజన గ్రామాల్లో మంత్రి అప్పలరాజుకు ఘన స్వాగతం లభించింది. సంప్రదాయ నృత్యాలతో, పూలను చల్లుతూ.. మేళతాళాలతో ఆహ్వానం పలికారు. సాబకోట పంచాయతీ ఏఓబీ కావడంతో మంత్రి పర్యటన సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీపీ డొక్కరి దానయ్య, ఏఎంసీ ఛైర్మన్ పి.వి.సతీష్, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, మాజీ సర్పంచ్ మద్దిల రామారావు, ఎంఎస్‌ఎస్ అధ్యక్షురాలు సవర కాంతమ్మ, కొత్తపల్లి సర్పంచ్ శనాపతి దివ్య, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, నాగేశ్వర బృందావన్, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.విజయలక్ష్మి, ఏఈలు కణితి కృష్ణారావు, గార రామ్మోహనరావు, ఎస్సీ శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్


సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మేఘవరం, పాతమేఘవరం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు ఇంతవరకూ చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, స్థానిక సర్పంచ్ పి.సునీతరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.రాజారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.భీమారావు, పి.రామకష్ణ, పి.శ్రీనివాస్‌రెడ్డి, అప్పారావు, గంట ఈశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీలోకి ఒక్క కార్యకర్త వెళ్లలేదు

- వైఎస్సార్‌సీపీ నాయకుల స్పష్టీకరణ


టెక్కలి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: తొలుసూరుపల్లి పంచాయతీ నుంచి ఒక్క కార్యకర్త కూడా టీడీపీలోకి వెళ్లలేదని ఆ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బగాది రామకృష్ణ, చింతాడ అప్పన్న స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తమ పంచాయతీ నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండించారు. అచ్చెన్నాయుడుతో పాటు కొంతమంది టీడీపీ కార్యకర్తలు కేవలం మభ్య పెట్టడానికే ఇటువంటి ప్రకటనలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న యువకులను మభ్యపెట్టి అచ్చెన్నాయుడు వద్దకు తీసుకువెళ్లి బలవంతంగా కండువాలు కప్పించారన్నారు. ఆ తరువాత ఆ యువకులు తమ వద్దకు వచ్చి జరిగిన సంఘటన వివరించి ఆవేదన వ్యక్తం చేశారన్నారు. టీడీపీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోవడంతో బలవంతపు చేరికలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి తప్పుడు కార్యక్రమాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ నాయకులు గూన గణేష్, యండ నిమ్మారావు, బగాది కృష్ణంరాజు, గూన షణ్ముఖ, గూన శ్రీనివాస్, వమరవల్లి ధర్మరాజు, బమ్మిడి నర్సింహమూర్తి, హనుమంతు శ్రీను, తిర్లంగి అప్పన్న, ధర్మా ఉన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిరం వార్షికోత్సవం


బాబాకు క్షీరాభిషేకం చేస్తున్న కేంద్ర మంత్రి కృపారాణి దంపతులు

టెక్కలి: కె.కొత్తూరు గ్రామంలోని షిర్డీసాయి మందిరం వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు వాకాడ జగదీశ్వర్‌రెడ్డి, ఇందుమతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బాబాకు కాగడ హారతి, మహాగణాధిపతి పూజ, పుణ్యాహావాచనం, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణము, మండప ఆవాహన, 108 కలశాలతో క్షీరాభిషేకం చేశారు. నెమలికొండ దత్తాత్రేయ పీఠాధిపతి సద్గురు సదానంద సరస్వతి స్వామిజీ పర్యవేక్షణలో సాయి మహాయజ్ఞం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దంపతులు, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కె.అచ్చెన్నాయుడు తదితరులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధాన కార్యక్రమానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు రాజాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు రూరల్: రాజాం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటుట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, ఎంపీడీవో ఈశ్వరమ్మ మంగళవారం తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జూదరుల అరెస్టు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని హడ్కో కాలనీ సమీపంలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. వీరివద్ద నుంచి 26,890 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరు అరెస్టు

భార్య, అత్తపై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధి జయరామచంద్రపురంలో ఇటీవల దాడి జరిగింది. ఈ కేసులో బద్రి నాగర్జున, పిన్నింటి రాజశేఖర్‌ను అరెస్టు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఉత్సవం


అమ్మవారి తిరువీధిలో చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కుటుంబ సభ్యులు ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గ్రామదేవత ఆలయంలో అమ్మవారికి తైలమర్దన, సిందూర మర్దన, పంచమృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మండపం వద్ద కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తిరువీధి నిర్వహించారు. తిరువీధిని నర్మదేశ్వరాలయం నుంచి బ్రాహ్మణవీధి మీదుగా మెయిన్ రోడ్డులో సంతపేట, జర్నలిస్టు కాలనీ, సబ్‌స్టేషన్, సురంగిరాజాకోట వీధి, ఎల్లమ్మ గుడివీధి, మసీదురోడ్, మేదర వీధులగుండా చేపట్టి ఉప్పల వీధిలోని ఉత్సవ మండపం వద్ద ముగించారు. కోయ నాటకం, బుట్టబొమ్మలాట, తప్పెటగుళ్ల ప్రదర్శనలు స్థానికులను అలరించాయి.

ట్రాక్టర్లపై జరిమానాలు ఉండవు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్


ట్రాక్టర్ల యజమానులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: భవన నిర్మాణ, వ్యవసాయ సామగ్రి తరలించే ట్రాక్టర్లపై ఎటువంటి జరిమానాలు లేకుండా విశ్వ సముద్ర సంస్థ ప్రతినిధులతో చర్చించామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వెల్లడించారు. ఇటీవల కాలంలో విశ్వ సముద్ర సంస్థకు చెందిన సిబ్బంది ఎక్కడికక్కడ ట్రాక్టర్లను నిలిపివేసి జరిమానాలు విధిస్తున్నారు. ఈ సమస్యను ట్రాక్టర్ యజమానులంతా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో విశ్వ సముద్ర సంస్థ ప్రతినిధులతో దువ్వాడ చర్చించారు. ఈ మేరకు మంగళవారం ట్రాక్టర్ల యజమానులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. భవన నిర్మాణ, వ్యవసాయ సామగ్రిని ట్రాక్టర్లపై తరలించే క్రమంలో ఎటువంటి జరిమానాలు లేకుండా ఈ పత్రం ఉపయోగపడుతోందన్నారు. ట్రాక్టర్ల యజమానులంతా ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం


కవిటి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది


వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కవిటి: మలేరియా రహిత సమాజస్థాపనే లక్ష్యం కావాలని బాలబాలికలు నినదించారు. ఆర్.బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ కవిత ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులచే మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం చైతన్యర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మాదిన కృష్ణారావు, హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: వ్యాధుల నియంత్రణ కోసం ప్రతిఒక్కరూ తప్పని సరిగా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కనిష్క అన్నారు. వజ్రపుకొత్తూరు, సీతాపురం, నువ్వలరేవు, పెద్దబొడ్డపాడు తదితర గ్రామాల్లో మలేరియా నిర్మూళన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు చేపట్టారు. మలేరియాకు కారణమైన దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్య,ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

గడప గడపలో 'జగనన్నే మా భవిష్యత్'


కోటబొమ్మాళి: పాడుగుపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు


కవిటి: శావసానపుట్టుగలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


మందస: వీరగున్నమ్మపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


టెక్కలి: తేలినీలాపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పోలాకి లక్ష్మి తదితరులు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై చేపడుతున్న ప్రజా సర్వేకు అనూహ్య స్పందన వస్తోంది. 'జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఇంటింటికీ వెళ్తున్న గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ ఇన్‌చార్జిలకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభిస్తోంది. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని గడప గడపలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

సోంపేట: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ సలీం బాషా అన్నారు. బారువ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల ప్రయోజనాన్ని తెలియజేశారు. సర్పంచ్ రజని, ఉపసర్పంచ్ రాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని మోదుగవలసలో నిర్వహించారు. బ్యాంకు సేవలు, ఆన్‌లైన్ ట్రాన్స్ క్షన్స్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్‌బీఐ టెక్కలి చీఫ్ మేనేజర్ ఎం.రవికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఎ.మధుసుదన్‌రావు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఎన్ఎస్ఎస్ పీవో వి.లూకెపాల్ పాల్గొన్నారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి


శంకరాచార్యులకు పూజలు చేస్తున్న భక్తులు

కాశీబుగ్గ: ఆదిగురువు శంకరాచార్యులు జయంతిని జైజగన్నాథ్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పలాస రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు పండా, సభ్యులు కై లాసుదాస్, నిత్యానంద పండా, గోకుల్ చంద్రదాస్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యుల వద్ద వసూళ్లు

- కంచిలి మండల సమావేశంలో సభ్యుల ఫిర్యాదు


ఎంపీపీ, ఎంపీడీవోలకు వీవోఏపై ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

కంచిలి: జాడుపూడి పంచాయతీ పరిధిలో పని చేస్తున్న వీవోఏ స్వయంశక్తి సంఘ సభ్యుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని సర్పంచ్ పలికల ద్రాక్షాయణి, ఎంపీటీసీ సభ్యురాలు జామి జయలు ఆరోపించారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేశారు. స్వయంశక్తి సంఘాలకు బ్యాంకు, ఇతర రుణాలు మంజూరైన సందర్భంలో వారికి అప్పు ఇచ్చిన సమయంలో ఒక్కో సభ్యురాలు నుంచి వీవోఏ అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దశ్రీరాంపురం ఎంపీటీసీ సభ్యురాలు మాదిన విమల ఉద్దానంలో కిడ్నీ బాధిత గ్రామాల్లో ప్రజలకు మినరల్ వాటర్ అందిస్తున్న పలు పాయింట్లు పనిచేయడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ ఎస్.హైమావతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో పాల్గొన్నారు.

ప్రతీ గడపలో సంతోషం : జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ గడపలో సంతోషం వ్యక్తమవుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కోథారి పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చేకూరిన లబ్ధిని తెలియజేసి..బ్రోచర్లను అందజేశారు. గత టీడీపీ పాలనకు, నేడు వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహన్‌రావు, ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, నాయకుడు పిట్ట విశ్వనాథం పాల్గన్నారు.


మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న చైర్‌పర్సన్ విజయ

క్షతగాత్రులకు పరామర్శ

కాశీబుగ్గ: కోటబొమ్మాళి నుంచి పలాసకు ఆటోలో వస్తుండగా కొత్త అగ్రహారం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపాలిటీ పరిధి 19వవార్డు సూదికొండకు చెందిన తోట పున్నమ్మ, అల్లిబిల్లి మిన్నరావు, తోట గురయ్య తదితరులు గాయపడ్డారు. వీరంతా టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పలాసకు చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పైల వెంకటరావు, బడగల బల్లయ్య, శిష్టు గోపి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. కొంత ఆర్థిక సహాయం చేశారు.